సీఎంతో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం కలెక్టరేట్ సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఈనెల 15,16 తేదీల్లో జరగనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ రామసుందర్‌రెడ్డి హాజరవుతున్నారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన వెంటనే జరుగుతున్న సదస్సు అయినప్పటికీ జిల్లాలో సాగు, పరిశ్రమలు, పర్యాటక సంబంధిత ప్రధాన అంశాలను నివేదిక రూపంలో తెప్పించుకున్నారు. ఈ విషయాలను ఏదో ఒకరోజు కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించనున్నారు.

వేడెక్కుతున్న ఉద్యమం





బొడ్డవరం గ్రామం వద్ద జిందాల్ నిర్వాసితుల ధర్నా

కూటమి ప్రభుత్వ ఆలోచన ప్రకారం జిందాల్‌కు అప్పగించిన భూముల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈ పార్కులు) పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ఆలోచనలో జిల్లా యంత్రాంగం ఉంది. జిందాల్ యాజమాన్యం మాట తప్పడంతో భూములను తిరిగి ఇవ్వాలన్న పట్టుదలతో భూ నిర్వాసితులు ఉన్నారు. ఈ సమస్య మూడు నెలలుగా నలుగుతోంది. రెవెన్యూ ఉన్నతాధికారులు తేలిగ్గా తీసుకోవడంతో ఉద్యమం రోజురోజుకు ముదురుతోంది. నిర్వాసితులు ఇటీవల ఢిల్లీలో సైతం ధర్నా చేసి సమస్యను జాతీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబుతో సోమవారం నుంచి జరిగే కాన్ఫరెన్స్‌లో సమస్యను కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ప్రస్తావిస్తారని నిర్వాసితులు భావిస్తున్నారు.

- ఢిల్లీలో ఇటీవల ధర్నా చేసిన జిందాల్ నిర్వాసితులు
- ఇక్కడా వివిధ రూపాల్లో కొనసాగుతున్న నిరసనలు
- తేలిగ్గా తీసుకుంటున్న ఉన్నతాధికారులు
- ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణాలపైనా అనుమానాలు
- సీఎం కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రస్తావిస్తారని రైతుల్లో ఆశ

శృంగవరపుకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి)

ఓ పక్క న్యాయస్థానాలను ఆశ్రయించడంతో పాటు స్థానికంగా వివిధ రూపాల్లో నిరసనలతో సమస్యను జిందాల్ నిర్వాసితులు అందరికీ తెలియజేస్తున్నారు. నాలుగు రోజుల కిందట దేశ రాజధాని ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో ఆందోళన చేయడం ద్వారా సమస్యను జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టిలోనూ పెట్టారు. జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఆ సంఘం దీనిపై జిల్లా అధికారులను వివరణ అడిగినట్లు సమాచారం. ఇలా భూ నిర్వాసితులు రోడ్డెక్కి 85 రోజులు దాటుతోంది. అయితే శాంతిభద్రతల పేరుతో పోలీస్‌లు ధర్నా, నిరవధిక నిరసన శిబిరాలను ఏర్పాటు చేసుకొనేందుకు స్థానికంగా అనుమతులు ఇవ్వలేదు. వీరొకచోట కావాలని అడిగితే పోలీస్‌లు మరో చోట ఇస్తామని చెబుతూ పలు షరతులు విధిస్తున్నారు. ఈ పరిణామం భూ నిర్వాసితులకు రుచించడం లేదు. వీరి డిమాండ్‌కు అనుగుణంగా రెవెన్యూ అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదు. కేవలం అప్పట్లో భూములకు నష్టపరిహారం అందని వారి (మిగతా 8వ పేజీలో..)

మంజూరు 4967.. పూర్తి 2399



బొబ్బిలి మండలం మెట్టవలస సీసీ రోడ్డు

- ప్రహసనంగా పల్లెపండగ పనులు
- అంచనా వ్యయం రూ.600 కోట్లు
- ఇప్పటివరకు అయినవాటి విలువ రూ.126 కోట్లు
- పర్సంటేజీలిస్తేనే ఎంబుక్కు నమోదు

మెంటాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పల్లెపండగ పనులు ప్రహసనంగా మారాయి. రెండు ఆర్థిక సంవత్సరాల్లో రూ.600.22 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన 4967 పనుల్లో ఇప్పటివరకు రూ.126.34 కోట్ల విలువైన 2399 పనులు మాత్రమే పూర్తయ్యాయి. వాటిలో కేవలం రూ.42 కోట్ల మేర మాత్రమే బిల్లులు చెల్లింపులు జరగ్గా ఇంకా సుమారు రూ.84 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ ప్రభావం వివిధ దశల్లో ఉన్న పనులతోపాటు ఇంకా ప్రారంభంకాని పనులపై పడుతోంది. బిల్లుల చెల్లింపు జరగక ఇదివరకే ప్రారంభమైన పనులు పూర్తిచేయడానికి కాంట్రాక్టర్లు ముఖం చాటేస్తున్నారు. దీంతో అవి గ్రామాల్లో అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి.

పంచాయతీరాజ్ శాఖను చూస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లెపండగ పేరుతో గతేడాది అక్టోబరులో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజున గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో జిల్లాలో మొత్తం రూ.438.22 కోట్ల అంచనాతో 4346 అభివృద్ధి పనులకు గ్రామసభలు ఆమోదించాయి. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.162 కోట్ల విలువైన 621 పనులు ఆమోదం పొందాయి. ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో గ్రామసభల్లో ఆమోదం పొందిన మొత్తం పనులు 4967 కాగా వీటి మొత్తం అంచనా వ్యయం రూ.600.22 కోట్లు. మంజూరైన పనుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రయిన్లు, బీటీ రోడ్లు, మెటల్ రోడ్లు ఉన్నాయి.

రూ.84.34 కోట్ల బిల్లులు పెండింగ్

రెండు ఆర్థిక సంవత్సరాల్లో పూర్తయినట్టుగా అధికారులు చెబుతున్న మొత్తం 2399 పనులకుగాను రూ.126.34 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈఏడాది జూన్‌లో రూ.42 కోట్లు మాత్రమే చెల్లింపులు జరగ్గా ఇంకా రూ.84.34 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయి.

ప్రారంభానికి నోచని 1579 పనులు

రెండు ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన మొత్తం 4967 పనుల్లో.. పూర్తయినట్టుగా అధికారులు చెబుతున్న 2399 పనులు, వివిధ దశల్లో ఉన్నాయని చెబుతున్న 989 పనులు కలిపి మొత్తం 3388 పనులు పోగా మిగిలిన 1579 పనులు ఇప్పటికీ ప్రారంభంకానట్టుగా గణాంకాలు చెబుతున్నాయి.

ఎంబుక్ నమోదుకు జంకు

వివిధ దశల్లో ఉన్న 989 పనుల్లో కొన్ని ఇటీవల పూర్తయినట్టు, అసలు ప్రారంభమే కాలేదని అంటున్న 1579 పనుల్లో కొన్ని ఈమధ్య మొదలైనట్టు సమాచారం. అయితే వీటికి ఎం బుక్ నమోదుకు అధికారులు (మిగతా 8వ పేజీలో..)



జిల్లా మీదుగా చేపట్టే కాలువతో అనుసంధానం అయ్యే పోలవరం ఎడమ కాలువ

సుజల స్రవంతికి రూ.వెయ్యి కోట్లు

- మొదటి విడత నిధుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్
- రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు

కొత్తవలస, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం నుంచి శ్రీకాకుళం వరకు పోలవరం ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు అందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి సంబంధించి కీలక అడుగు పడింది. పథకం పనులు చురుగ్గా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా వెయ్యి కోట్ల రూపాయల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వచ్చే రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేయాలని కూడా భావిస్తోంది.

అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం నుంచి సబ్బవరం మండలం, జిల్లాలోని కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, శృంగవరపు కోట మండలాలతోపాటు మరికొన్ని మండలాలు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లా వరకు ఈ కాలువ నిర్మాణం చేపడ్తారు. ఇప్పటికే భూసేకరణ పనులు పూర్తి చేశారు. నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జలవనరులశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా సన్నాహాలు మొదలయ్యాయి. మొదటి విడతగా ఈ సంవత్సరం రూ.వెయ్యి కోట్లు, వచ్చే సంవత్సరం మరో రూ.వెయ్యికోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. ఈ కాలువ నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాలకు కొండంత అండ లభిస్తుంది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ఈసుజల స్రవంతి పథకం తెర పైకి వచ్చింది. తరువాత 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో సర్వే పనులు కొంత మేర జరిగాయి కాని భూ సేకరణకు నిధులు కేటాయించలేదు. సర్వే చేసి వదిలేయడంతో రైతులు అప్పటి నుంచి ఆ భూములను ఎవరికీ అమ్ముకోవాలని భావించినా కొనేవారు ముందుకు రాక నానా అవస్థలు పడుతున్నారు. కాగా గ్రామాల్లో సభలను ఏర్పాటు చేసి భూములు కోల్పోతున్న బాధిత రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. తమకు మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని, ప్రత్యామ్నాయంగా భూములను కేటాయించాలని కోరుతున్నారు. రైతుల అభిప్రాయాలను అధికారులకు నివేదిస్తామని గ్రామ సభలు నిర్వహిస్తున్న అధికారులు తెలిపారు.



రామలింగాపురం వద్ద కాలువ నిర్మాణానికి సేకరించిన భూమి

వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి జేడీగా భారతి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ శాఖ జేడీగా పనిచేస్తున్న తారక రామారావు వ్యక్తిగత కారణంతో సెలవు పెట్టారు. ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా వనరుల కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న భారతికి అప్పగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. తారక రామారావు 45 రోజులు సెలవు పెట్టడంతో అంతవరకు ఆ బాధ్యతలను భారతి చూస్తారు.

తిరుపతి సదస్సులో జిల్లా మహిళా ప్రజాప్రతినిధులు



ఈనెల 14, 15 తేదీల్లో తిరుపతిలో జరుగుతున్న మహిళా పార్లమెంటేరియన్ సదస్సుకు జిల్లా నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరీ, ఎస్.కోట, విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, అదితి గజపతిరాజు, లోకం నాగమాధవితో పాటు ఎమ్మెల్సీ గ్రీష్మ కూడా వెళ్లారు. సదస్సు సోమవారంతో ముగిశాక వారంతా అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు వెళ్లనున్నారు.

- విజయనగరం రూరల్/ ఎస్.కోట రూరల్ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

నేడు ఉపాధ్యాయుల ఎంపిక తుది జాబితా విడుదల

విజయనగరం కలెక్టరేట్ సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా సోమవారం రాష్ట్ర విద్యా శాఖ విడుదల చేస్తుందని డీఈవో మాణిక్యంనాయుడు ఆదివారం తెలిపారు. ఇప్పటికే అభ్యర్థుల ధ్రువ పత్రాలు పరిశీలించామని, మేనేజ్మెంట్ వారీగా పోస్టుల తుది జాబితాను రూపొందించామని పేర్కొన్నారు. ఆ జాబితాను జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్ద ప్రదర్శిస్తామని, అలాగే మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపిడిఎస్‌సి.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో ఉంచుతామని తెలిపారు.

రాష్ట్రానికి విస్తృతంగా పెట్టుబడులు

- ఉద్యోగ, ఉపాధి కల్పన దిశగా అడుగులు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్


విజయనగరం రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి విస్తృతంగా పెట్టుబడులు రానున్నాయని, ఉద్యోగ.. ఉపాధి కల్పన దిశగా అడుగులు పడుతున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. దావోస్ పర్యటనకు వెళ్లి తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఆయన ఆదివారం విజయనగరంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. దావోస్, జర్మనీ పర్యటనలో తాను ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాల గురించి అక్కడి కంపెనీల ప్రతినిధులతో చర్చించానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న సహకారం గురించి వివరించానన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగ సమస్య పూర్తిగా తగ్గుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏడాదిన్నర కాలంలోనే అమలు చేసేందుకు ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు. స్త్రీశక్తి పథకం విజయవంతమైందని, మహిళలంతా సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు.

- విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ సిరిమానోత్సవాలను ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు (మిగతా 8వ పేజీలో..)



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

అపూర్వ కట్టడాలు



బొబ్బిలి రాజా వారి గెస్ట్‌హౌస్

- బొబ్బిలిలో చెక్కు చెదరని బ్రిటీష్ కాలం నాటి భవనాలు
- నేడు ఇంజనీర్స్ డే

బొబ్బిలి,సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక భవనాలు ఒకప్పటి నిర్మాణ సామర్థ్యానికి చిహ్నంగా పదిలంగా ఉన్నాయి. ఆధునిక సాంకేతిక పద్ధతులేవీ అందుబాటులో లేని ఆ రోజుల్లో నిర్మించిన భవనాలు పూర్వీకుల ఆలోచన, పనితనానికి మచ్చుతునకలుగా నిలుస్తున్నాయి. ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డేగా జరుపుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో నాటి భవనాల నిర్మాణంలో వాడిన కౌశలాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవాల్సిందే. ఆ భవంతులు, వంతెనల జీవిత కాలం వందేళ్లకు పైగా ఉంటుందని అంచనా. బొబ్బిలి మండలంలో పారాది గ్రామం వద్ద అంతరాష్ట్రాలను కలుపుతూ వేగావతి నదిపై నిర్మించిన వంతెన ఇటీవల వరకు రవాణారంగానికి అత్యంత ఉపయుక్తంగా సేవలందించింది. నేటికీ భారీ వాహనాలు మినహా ఇతర వాహన రాకపోకలు సాగుతున్నాయి. బొబ్బిలి పట్టణంలో జమిందార్ల పాలనాకాలంలో నిర్మించిన బొబ్బిలి కోట, వేణుగోపాలస్వామి ఆలయం, రాజా వారి గెస్ట్‌హౌస్‌లు ఇప్పటికీ సుందరంగా కనిపిస్తున్నాయి. సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.



పారాది వంతెన

- 1925లో నిర్మించిన రాజా వారి గెస్ట్‌హౌస్‌తో పాటు కోట, వేణుగోపాల స్వామి ఆలయాలు సినిమా షూటింగ్‌లకు అనుకూలంగా పేరొందాయి. వాటి నిర్మాణ శైలి, అద్భుతమైన వాస్తు నేటి ఇంజనీర్లను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. అప్పట్లో చెన్నై ఇతర ప్రాంతాల నుంచి నిర్మాణరంగ నిపుణులను తీసుకొచ్చి వీటిని నిర్మించారని చెబుతారు. సిమెంట్ వాడకానికి బదులు ప్రత్యేకంగా సున్నం తయారు చేసి ప్రాకారాలను రూపొందించారు. శిల్పకళాచాతుర్యంతో పటిష్టంగా నిర్మించారు.

గురజాడ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలి

7లో

- పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి

గజపతినగరం రైల్వేస్టేషన్‌కు కొత్త రూపు

7లో

- నూతనంగా బ్రిడ్జి నిర్మాణం

మల్లమ్మ చెరువుకు గండి

8లో

- పొలాల్లోకి నీరు
- ఇసుక బస్తాలతో పూడ్చిన రైతులు

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తామని, అన్ని శాఖ అధికారులు అందుబాటులో ఉంటారని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలను అర్జీదారులు వినియోగించుకోవాలని కోరారు. అలాగే అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ సేవలను 1100 వినియోగించుకోవాలన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

గంట్యాడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం సోమవారం నుంచి వచ్చే నెల 15 తేదీ వరకూ నిర్వహిస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ డా.రెడ్డి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మూడు బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామానికి ఆయా తేదీల్లో టీకాలు వేస్తారని చెప్పారు. రైతులందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వారం రోజుల్లో 1500 మెట్రిక్ టన్నుల యూరియా

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రానున్న వారం రోజుల్లో 1000 నుంచి 1500 మెట్రిక్ టన్నులు యూరియా జిల్లాకు రానున్నదని వ్యవసాయ శాఖ ఇన్‌చార్జీ జేడీ భారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో జిల్లా అవసరాలు తీరనున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. జిల్లాలో ఆదివారం 933 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారని ఆమె చెప్పారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాజాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును కోరారు. ఆదివారం రాజాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు ఏపీటీఎఫ్ విజయనగరం జిల్లా ఉపాధ్యక్షుడు లంక రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వై.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

సంతకవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మన గ్రోమోర్ దుకాణంలో యూరియా అమ్మకాలపై విజిలెన్స్ అధికారులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఐ అశోక చక్రవర్తి ఆధ్వర్యంలో కోరమాండల్ ఫెర్టిలైజర్‌లో తనిఖీలు చేశారు. మండలంలో ఎక్కడెక్కడ యూరియా నిల్వలు ఉన్నాయని ఏవో యశ్వంత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు ఇంజనీర్ గణేష్, సిబ్బంది ఉన్నారు.

దుర్గమ్మతల్లి పండుగకు పందిరిరాట



పందిరిరాట వేస్తున్న దృశ్యం

జామి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అన్నంరాజుపేట గ్రామంలో ఆదివారం దసరా మహోత్సవాలు పురస్కరించుకుని దుర్గమ్మ తల్లి పూజలకు గ్రామస్థులంతా కలిపి పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో అన్నంరాజుపేట పీఏసీఎస్ అధ్యక్షుడు ఎన్నింటి అప్పలరాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా తమ గ్రామంలో దసర పండుగ వైభవంగా చేసుకుంటామని తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని రాష్ట్ర హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీకాకుళంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. ఈనెల 18 నుంచి 20 వరకూ బెంగుళూరులో జరిగే జాతీయ స్థాయి ఎఫ్ఆర్‌హెచ్‌ఏ సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, భవిష్యత్తులో మరింత ఉన్నతంగా తయారుకావాలని రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలను అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మెట్టా నాగరాజు, బి.శ్రీనివాస్, వినోద్, ఆనంద్ పాల్గొన్నారు.

అధ్వానంగా ఆనందపురం

- ఎక్కడ చూసినా చెత్త
- మురుగుతో నిండిన కాలువలు



రోడ్డుపైన నిల్వ ఉన్న మురుగు

గుర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. వీధుల్లోని కాలువలన్నీ మురుగుతో నిండిపోయాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడే సమయంలో ఇళ్ల ముందే నీరు నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. వ్యాధులు ప్రబలితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అలాగే గ్రామంలోని శివాలయం చుట్టుపక్కల మురుగునీరు నిలిచి భక్తులకు అసౌకర్యం కలిగిస్తోంది. విద్యార్థులు బస్‌స్టాప్ వద్దకు చేరుకోవాలంటే ప్రతిరోజూ మురుగు నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.



గ్రామంలో మురుగుతో నిండిన కాలువ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

గ్రామంలో రోడ్లు, వీధి కాలువలు సక్రమంగా లేవు. గతంలో నిర్మించిన కాలువలు వెడల్పు తక్కువగా ఉండడం వల్ల ఎప్పటికప్పుడే మురుగు నిండిపోతుంది. నూతనంగా కాలువలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ఆనందపురం

పేరులో ఉన్న సిరి.. ఊరిలో ఏది?

- వర్షం కురిస్తే గ్రామమంతా చిత్తడే
- కానరాని కాలువలు, రోడ్లు
- అవస్థలు పడుతున్న సిరిపురం గ్రామ ప్రజలు

గంట్యాడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అది గిరిజన గ్రామం కాదు.. మారుమూల గ్రామం అంతకంటే కాదు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్లు, మండల కేంద్రానికి మూడు కిలో మీటర్లు దూరంలో ఉన్న ఈ గ్రామం అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. ఇదే సిరిపురం గ్రామం. ఈ గ్రామంలో సరైన రోడ్లు లేవు. కాలువలు లేవు. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో సీసీ రోడ్లు గానీ, డ్రైనేజీ కాలువలు గానీ నిర్మించే పరిస్థితి కనిపించలేదు. చిన్న వర్షం కురిసినా గ్రామంతా చిత్తడి చిత్తడిగా మారిపోతుంది. దీంతో గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలకు సీసీ రోడ్లు, కాలువలు మంజూరైనా సిరిపురం గ్రామానికి ఏ పనీ మంజూరు కాలేదు. దీనికి గ్రామంలోని నాయకుల మధ్య సమన్వయం లోపమే కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్లు, కాలవులు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సిరిపురం గ్రామంలో చిత్తడిగా ఉన్న రోడ్డు

అమరావతి రైతుల్లా చూడండి

- జిందాల్ నిర్వాసితుల ధర్నా

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తమను కూడా అమరావతి రైతుల్లా చూడాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. తమ భూములు తమకు ఇప్పించాలని కోరుతూ వారు బొడ్డవర గ్రామంలో గత 85 రోజులుగా శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడారు. గత ప్రభుత్వం జీవో నెంబర్-14 ఇచ్చిందని ఈ జీవోతో జిందాల్ యాజమాన్యం ఇక్కడ రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి తెర లేపుతుందన్నారు. వెంటనే రైతుల భూములు రైతులకు ఇప్పించి తిరిగి ప్రభుత్వమే ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేసి, ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

నిరాధార ఆరోపణలు తగవు



సాక్షి పత్రికను తగులబెడుతున్న టీడీపీ శ్రేణులు

రాజాం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్థానికంగా ఉండడం లేదని.. ఆయన సోదరుడు అన్నీ చక్కబెడుతున్నారంటూ ఆరోపిస్తూ ఇటీవల సాక్షి మీడియాలో వచ్చిన కథనాలపై టీడీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆదివారం రాజాం పట్టణంలో వారంతా మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం సాక్షి పత్రికను దహనం చేశారు. సంతకవిటి మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడు, వంగర మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావు నాయుడు తదితరులు మాట్లాడుతూ నిరాధార ఆరోపణలు తగవన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో పుష్పలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మండల శాఖ అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

గణపతి ఉత్సవాలతో జాతీయ సమైక్యత

- మంత్రి శ్రీనివాస్
- కొండపేటలో ఘనంగా గణేష్ నిమజ్జనం

నెల్లిమర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గణపతి ఉత్సవాలు జాతీయ సమైక్యతకు దోహదపడతాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని తూర్పు మహారాజుపేట (కొండపేట)లో గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత 91 సంవత్సరాలుగా ఈ గ్రామంలో గణపతి ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఊరేగింపులో సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కమిటీ ప్రతినిధులు ఆల్తి శ్రీనివాసరావు, నడిపేన నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ తదితరులు

గురజాడ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలి

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతిని ఈనెల 21న రాష్ట్ర పండుగగా నిర్వహించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఆదివారం స్థానిక గురజాడ గృహంలో ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు689 ప్రకారం 22 మంది ప్రముఖుల జయంతి, వర్ధంతులను రాష్ట్ర పండుగగా నిర్వహి స్తామని ప్రకటించిందని, అందులో మహాకవి గురజాడ అప్పారావు పేరు లేకపోవడం గురజాడ సాహిత్య అభిమానులు, ఉత్తరాంధ్ర ప్రజలు బాధపడ్డారన్నారు. ఈనెల 18న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జిల్లా ఎమ్మెల్యేలు.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లి, రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రొంగలి పోతన్న, డా.వెంకటేశ్వరరావు, దవళ సర్వేశ్వరరావు, దవడ కొండబాబు, గురజాడ ఇందిర, వెంకటేశ్ ప్రసాద్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతులను చూపిస్తున్న వేదిక ప్రతినిధులు

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఎన్నిక



వేదికపై జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ఘనంగా ముగిశాయి. జడ్పీ సమావేశ భవనం వేదికగా జరిగిన ఈ ఉత్సవాలు ఉత్సాహంగా సాగాయి. చివరి రోజు పది తీర్మానాలను ఆమోదించారు. నూతన కమిటీని 75 మందితో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేఎస్ లక్ష్మణరావు, పి.సురేష్, కోశాధికారిగా జి.మురళీధర్‌లు ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, సబ్ కమిటీ కన్వీనర్లుగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

సిరియేలపేట రోడ్డుకు మోక్షమెప్పుడో?

- కొన్నేళ్లగా ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

మెరకముడిదాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం మండలం కొర్లాం పంచాయతీ మధుర గ్రామమైన సిరియేలపేట రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గత కొన్ని సంవత్సరాల నుంచి రోడ్డు పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. రోడ్లు అభివృద్ధికి ప్రతిఏటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించినప్పటికీ ఈ రోడ్డును పట్టించుకున్న నాథుడు కరువయ్యాడు. ఈ రోడ్డు నాలుగు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం. అయినప్పటికీ ఇటు అధికారులు గానీ అటు ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గోతులమయంగా సిరియేలపేట వెళ్లే రోడ్డు

గజపతినగరం రైల్వేస్టేషన్‌కు కొత్త రూపు

- ప్రయాణికులకు తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పన

గజపతినగరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం రైల్వే స్టేషన్ కొత్త రూపు దిద్దుకుంటోంది. ప్రస్తుతం కోట్లాది రూపాయలతో ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. మూడో రైల్వేలైన్ రావడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నాలుగు ప్లాట్‌ఫామ్‌లకు అనుగుణంగా పనులు చేపడుతున్నారు. ఇందుకు అవసరమైన బ్రిడ్జి పనులు చేస్తున్నారు. అలాగే జాతీయ రహదారి నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు చేరుకునేలా స్థల సేకరణ చేపట్టి నాలుగు రోడ్ల విస్తరణ చేపట్టారు. జాతీయ రహదారి నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు వచ్చే విధంగా రోడ్డు వేశారు. గతంలో రైల్వేస్టేషన్‌లో రెండు లైన్లు ఉండగా ప్రస్తుతం నాలుగు లైన్లుగా విస్తరించారు. ఉద్యోగులు విశ్రాంతి తీసుకోవడంతో పాటు వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు అనుకూలంగా ఉండే విధంగా ఇప్పటికే పార్కును ఏర్పాటుచేశారు. నియోజకవర్గ మండల కేంద్రమైన గజపతినగరం రైల్వేస్టేషన్‌కు గజపతినగరం, బొండపల్లి, మెంటాడ మండలాలకు చెందిన సుమారు 130 గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడ రైల్వేస్టేషన్‌కు వచ్చి పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మేరకు ప్రతి ప్లాట్‌ఫాంపై కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీటి కొళాయిలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ హాల్టు కల్పించాలి

గజపతినగరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ప్రతిరోజూ అధికంగానే ఉంటుంది. తిరుపతి, ఢిల్లీ, చెన్నై వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు విజయనగరం గానీ, విశాఖపట్నం గానీ వెళ్లి అక్కడ రైలును ఆశ్రయించాల్సి వస్తోంది. గజపతినగరం స్టేషన్ మీదుగా 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ఇందులో ఒక్క నాగావళి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రమే హాల్ట్ కల్పించారు. మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు హాల్టు కల్పించాలని నియోజకవర్గ ప్రజలు.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు వినతులు ఇచ్చారు.



గజపతినగరం రైల్వేస్టేషన్‌లో నూతనంగా చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణం

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

సీతానగరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వెంకటాపురం సమీపంలో వి.రాము(33) అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి మండలం శివడవలస గ్రామానికి చెందిన రాము.. సీతానగరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ధనలక్ష్మిని కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. అయితే వారి మధ్య ఈ మధ్యకాలంలో గొడవ జరుగుతుండేవి. దీంతో మనస్తాపానికి గురైన రాము ఆదివారం మధ్యాహ్న సమయంలో పురుగు మందు తాగాడు. విషయం గమనించిన స్థానికులు పార్వతీపురంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ రాము చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి లక్ష్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై ఒకరు..

సాలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారమ్మ కాలనీ గొడగల వీధికి చెందిన జలుమూరు సాయి(34) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన సాయి భార్యా పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. మద్యం తాగడం వల్ల అనారోగ్యం పాలవ్వడంతో పాటు మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఆదివారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య ప్రేమలత, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పట్టణ ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతి

మక్కువ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతి చెందిన ఘటన మక్కువ మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎం.పాలికవలస గ్రామానికి పాల గౌరు(39) తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మక్కువ బీసీ కాలనీకి చెందిన మామిడి ఆనందరావు ఇంటి నిర్మాణానికి కాంట్రాక్టు తీసుకున్నాడు. ఆదివారం ఆనందరావు ఇంటి శ్లాబ్‌ను పరిశీలించేందుకు గౌరు మేడపైకి వెళ్లాడు. పరిశీలన అనంతరం కిందకు దిగుతుండగా ఇంటి పక్కనే వేలాడుతున్న హెచ్‌టీ లైన్ అతడికి తగిలింది. దాంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య పైడితల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని ఒకరు..

దత్తిరాజేరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం టోల్‌ప్లాజా వద్ద లారీ ఢీకొని హిజ్రా మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మానాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదమానాపురం టోల్‌ప్లాజా వద్ద ఒక హిజ్రా నడుచుకుంటూ వెళ్తుండగా.. రామభద్రపురం వైపు నుంచి విజయనగరం వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో హిజ్రా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

- ముగ్గురికి గాయాలు

సంతకవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం-పాలకొండ ప్రధాన రహదారిపై పొనుగుటివలస పరిధిలోని జీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ గేట్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాల పాలయ్యారు. ఈ ఘటనపై ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి ఆమదాలవలస మండలం ఆడవరం గ్రామానికి చెందిన బంకి రమణమ్మ తన భర్త సింహాచలంతో కలిసి అదే గ్రామం నుంచి మనుమరాలు రితికను తీసుకుని చీపురుపల్లిలోని తన కుమార్తె ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. జీఎంఆర్ గేట్ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. పక్క వీధిలోకి తిప్పే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. బంకి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

మూడు తులాల బంగారం చోరీ

కొత్తవలస, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశపాత్రునిపాలెం పంచాయతీ శివారు శీరం శెట్టివానిపాలెం గ్రామంలోని ఒక ఇంటిలోకి శనివారం అర్ధరాత్రి దుండగులు చొరబడి సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.24 వేల నగదు దోచుకున్నారు. కంటకాపల్లి పంచాయతీలోని శారదా కర్మాగారంలో పనిచేస్తున్న మీసాల రవి ప్రకాష్ అనే వ్యక్తి దేశపాత్రునిపాలెం వద్ద డెక్కన్ ఫెర్రోఅల్లాయిస్ కర్మాగారం సమీపంలోనున్న శీరంశెట్టివానిపాలెం గ్రామానికి కొద్ది దూరంలో ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఇంటికి ఒక వ్యక్తి ముందుగా వెళ్లి తలుపుకొట్టాడు. దీంతో రవిప్రకాష్ మామయ్య రాము తలుపు తీసి చూడగా.. ఆ వ్యక్తి బెదిరించి లోపలికి చొరబడ్డాడు. ఆ వెంటనే మరో ఐదుగురు వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి రవిప్రకాష్ భార్య సత్యవతిని, మిగిలిన కుటుంబ సభ్యులను బెదిరించారు. మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.24వేల నగదును దోచుకున్నారు. అందిన సమచారం మేరకు ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, కొత్తవలస ఎస్ఐ జోగారావు ఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించింది. రవిప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేయగా, ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి కాలువల్లో కోళ్ల వ్యర్థాలు

- ఇబ్బంది పడుతున్న రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు



పొలాల్లో పడేసిన కోళ్ల వ్యర్థాలు

గుర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కోళ్లఫారం వ్యర్థాలను విచ్చలవిడిగా పొలాల్లోనూ, సాగునీటి కాలువల్లో పారబోస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గుజ్జింగివలస గ్రామంలోని చోడవరం రెవెన్యూ పరిధిలో గల ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువల్లో, పంట పొలాల సమీపంలో కోళ్ల వ్యర్థాలను రాత్రి వేళల్లో రహస్యంగా తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. దీంతో పంట కాలువ నుంచి పొలాల్లోకి వెళ్లే నీరు కలుషితమై పంటల సాగుకు అంతరాయం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. కోళ్లఫారం వ్యర్థాలను పొలాల్లోకి, గుంతల్లోకి తరలిస్తున్నారని చెప్పారు. దీంతో కాలువల వద్ద గుంతలు ఆనుకుని ఉన్న పొలాల్లోనూ, సాగునీటి వనరులు, భూగర్భ జలాలు, పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సంఘం నాయకులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ కనీసం పెన్షన్ రూ.9వేలు పోరాటంతో సాధించుకోవాలని ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సంఘం జిల్లా కార్యదర్శి ఓఎస్ఎన్.మూర్తి, కోశాధికారి అంబళ్ల గౌరినాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అమర కార్మికుల భవనంలో ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడారు. ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ పెన్షన్‌దారుల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మోయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన రైవాడ కాలువపై కల్వర్టు

మరమ్మతులు లేక.. అవస్థలు తప్పక

● బస్సులు రద్దు చేసిన ఆర్టీసీ అధికారులు ● ఇదీ రైవాడ కాలువపై వంతెన పరిస్థితి

వేపాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణరాయుడుపేట సమీపంలోగల రైవాడ కాలువపై కొత్తవలస-దేవరాపల్లి రహదారిలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కనీస మరమ్మతులు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు, వాహన చోదకులు అగచాట్లకు గురవుతున్నారు. కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఈ రహదారిలో వచ్చే ఆర్టీసీ బస్సులను రద్దుచేశారు. దీంతో ఈ రహదారిలో విశాఖపట్నానికి నిత్యం రాకపోకలుసాగించే వ్యాపారులు, విద్యార్థులు, రోగులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. ప్రధానంగా వేపాడ, దేవరాపల్లి, కోటపాడు మండలాల ప్రజలు ఈ దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ శిథిలావస్థకు చేరిన కల్వర్టు గురించి విశాఖ నగరపాలక సంస్థ, రోడ్లు భవనాలశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ కాలువ దుస్థితి గురించి విశాఖపట్నం మేయర్, మునిసిపల్ ఎండీని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కలిసి వివరించారు. తక్షణమే నిధులు మంజూరు చేసి కొత్తది నిర్మించకపోతే కూలిపోతే రెండు జిల్లాల ప్రజల రాకపోకలకు అవస్థలు తప్పవని తెలియజేశారు. ఇప్పటికైనా శృంగవరపుకోట, మాడుగుల నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కల్వర్టును పునర్నిర్మించాలని, రాకపోకలకు అనుగుణంగా బస్సులు నడపాలని సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కిటికీలు పాడై.. వర్షానికి నీరు చేరి

● మందులు తడిచిపోతున్న వైనం ● ఇదీ భీమాళి ఆయుర్వేద ఆసుపత్రి దుస్థితి

లక్కవరపుకోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమాళి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనం కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన నెలకొంది. బిక్కుబిక్కుమని సిబ్బంది విధులు నిర్వహించాల్సివస్తోందని ఇక్కడి సహాయ వైద్యులు, ఎంఎన్‌వో చంద్రరావు చెబుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా భవనం పూర్తిగా కారిపోయి మందులే తడిచిపోతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే ముడుకులోతు నీరు చేరుతోంది. దీంతో పాములు, విషజంతువులు గదుల్లోకి చేరుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు.కిటికీలు కూడా పాడై పుచ్చిపోయాయి. దీంతో మందులు, రికార్డులు రాత్రి పూట దొంగలుతీసుకువెళ్తారన్న ఆందోళన నెలకొంది. ఇక్కడ ఉన్న ప్రధాన వైద్యులు కూడా బదిలీపై వెళ్లిపోవడంతో పట్టించుకునే నాథుడే లేరని వాపోయారు. భీమాలి ఆయుర్వేద ఆసుపత్రిపై జిల్లా అధికారులు కనీసం పట్టించుకోలేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆయుర్వేద వైద్యంపై గ్రామీణప్రాంతాల్లో అవగాహన పెరగ డంతో ప్రతిరోజూ ఇక్కడకు రోగులువస్తున్నారు. అయితే ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో గదుల్లో నీరు ఉండడంతో బయట నిలబడి మందులు అందజేయాల్సివస్తోంది. ఇప్పటికైనా సర్పంచ్, సచివాలయకార్యదర్శి పక్కన ఉన్న గ్రామసచివాల యంలో ఒకగది ఆస్పత్రికి కేటాయించాలని సిబ్బంది కోరుతున్నారు. కాగా ఇక్కడి వైద్యాధికారి ఆరు నెలల కిందట బదిలీపై వెళ్లిపోవడంతో తర్వాత ఎవర్నీ నియమించలేదు. దీంతో ఎంఎన్‌వో చంద్రరావు అన్ని తానై సేవలం దిస్తున్నారు.



వర్షానికి తడిచిపోయిన ఆయుర్వేద మందులు



చెరువులో పేరుకుపోయిన చెత్త

చెత్త వేసి.. చెరువు కప్పేసి

● చెత్త సంపద కేంద్రం లేకపోవడంతో అవస్థలు ● ఇదీ మందరాడలో పరిస్థితి

సంతకవిటి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మందరాడ పంచాయతీ పరిధిలోగల చిన్నరామినాయుడు చెరువులో గ్రామస్థులు చెత్త వేస్తుండడంతో చెరువు గర్భం కుదించుకుపోతోంది. ఇక్కడి చెత్తసంపద కేంద్రం లేకపోవడంతో సేకరించిన చెత్తను పంచాయతీ కార్మికులు చెరువులో డంప్‌చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త కుళ్లడంతో దుర్వాసన వెలువడుతోందని చుట్టుపక్కల నివాసముంటున్న వారంతా వాపోతున్నారు. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో వ్యాధులు ప్రబలుతాయోమోనని భయాందోళన చెందుతున్నారు. సుమారు రెండెకరాలపై బడి ఉండే చెరువులో చెత్త వేసి కప్పేస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో భవిష్యత్ కింద ఉండే ఆయకట్టుకు నీరందే అవకాశముండదని వాపోతున్నారు. దీనికి తోడు చెత్త వేయడం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతాయని గ్రామస్థులు చెబుతున్నారు. సుమారు మూడువేల మంది జనాభా ఉండే ఈ గ్రామంలో తాగునీటి ఎక్కువగా భూగర్భ జలాలపైనే ఆధారపడాల్సివస్తోంది. తక్షణమే పంచాయతీ అధికారులు చెరువులో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతోపాటు చెత్త సంపద కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వేడెక్కుతున్న ఉద్యమం

(ఐదో పేజీ తరువాయి)

గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. మిగిలిన సమస్యల పరిష్కారం గురించి పెదవి విప్పడం లేదు. దీంతో జిందాల్ యాజమాన్యం మాటకే రెవెన్యూయంత్రాంగం విలువ ఇస్తోందన్న అపవాదుఉంది.జిందాల్ యాజమాన్య ఒత్తిడికి అధికారయంత్రాంగం తలొంచుతోందని భూనిర్వాసితులు భావిస్తున్నారు. సమస్యను ఎటూ తేల్చకపోవడంతో ఆ భూముల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎస్‌ఎంఎస్ఈ పార్కులు) పరిశ్రమల నిర్మాణాలపైనా నిరుద్యోగులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి సమస్యను ప్రస్తావిస్తారని భూ నిర్వాసితులతో పాటు నిరుద్యోగ యువత ఆశిస్తోంది.2007 జూన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం అల్యూమినియం శుద్ధి కర్మాగారం (రిఫైనరీ విద్యుత్ పవర్ ప్లాంట్) నిర్మాణం చేపట్టేందుకు జెఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ (జిందాల్ యాజమాన్యం)కు శృంగవరపుకోట మండల పరిధిలో 1166.43ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ, జిరాయితీ భూములను అప్పగించింది. ఈ భూముల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 834.66 ఎకరాల డి.పట్టా భూములున్నాయి. అప్పట్లో వీరంతా భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపలేదు.ఈ భూముల్లో మామిడి, జీడి, కొబ్బరి, అరటి, చెరకు, వంటి వాణిజ్య పంటలతోపాటు వరి, రాగులు వంటి ఆహార ధాన్యాలు సాగు చేసేవారు. అయితే భూములిస్తే రైతులకు నష్టపరిహారంతో పాటు పిల్లలకు ఉద్యోగాలు, షేర్లు, నివాస గృహాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని స్థానిక రాజకీయ నాయకులతో చెప్పించారు.వీరి మాటలను నమ్మి భూములను అప్పగించారు.నాలుగేళ్లలోనిర్మిస్తామని చెప్పిన పరిశ్రమకు ఇంతవరకు పునాదులు పడలేదు.ఇంకేం పరిశ్రమ నిర్మిస్తారన్న భావనతో కొంతమంది ఈ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు. అయితే భూములను తీసుకున్న 18 సంవత్సరాల తరువాత అల్యూమినియం శుద్ధికర్మాగారానికి బదులుగా పదిరకాల ఎంఎస్ఎంఈ(సూక్ష్మ,చిన్న, మధ్య తరహాపరిశ్రమలు) పార్కులు నిర్మిస్తామని జిందాల్‌యాజమాన్యం ముందుకువచ్చింది. భూములను చదును చేస్తుండడంతో నిర్వాసితులు అడ్డుకోనే ప్రయత్నం చేశారు. అప్పటి నుంచి వివాదం నడుస్తోంది. నిర్వాసితులు పట్టువదలకుండా ఉద్యమం నడుపుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారంజిందాల్ యాజమాన్యం పరిశ్రమ నిర్మాణం చేయకపోవడంతో పాటు ఉద్యోగాలు, షేర్లు, ఇతర సదుపాయాలు కల్పించలేదు కాబట్టి తిరిగి భూములను ఇచ్చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నెలలుగా పోరాటం చేస్తున్నా జిల్లా అధికారులు నిర్వాసితులు, జిందాల్ యాజమాన్యంతో చర్చలు ఏర్పాటు చేయడం లేదు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామసుందర్ రెడ్డి ఈ సమస్యకు పరిష్కారం చూపడం ద్వారా పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం చేస్తారేమోనని నిరుద్యోగ యువత భావిస్తోంది. తమకూ ఓ మార్గం చూపుతారని నిర్వాసితులు ఆశతో ఉన్నారు.

మంజూరు 4967..పూర్తి 2399

(ఐదో పేజీ తరువాయి)

జంకుతున్నట్టు తెలుస్తోంది. ఎంబుక్ ప్రక్రియ పూర్తయితే కాంట్రాక్టర్ల నుంచి బిల్లులకు ఒత్తిడి పెరుగుతుందని వెనుకంజ వేస్తున్నట్టు భోగట్టా. పల్లెపండగ పనులకు పర్సంటేజీల బెడద భరించలేకున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఉన్నతాధికారుల పేరుచెప్పి 7 నుంచి పది శాతంవరకూ డిమాండ్ చేస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు.

ఎక్కడివక్కడే..

బిల్లులు అందక జిల్లాలో అనేకచోట్ల పనులను అర్ధాంతరంగా నిలిపేశారు. దీంతో ప్రజల అసౌకర్యానికి గురవుతున్నారు. పనులు పూర్తికి ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. బిల్లుల చెల్లింపులపై గంపెడాశతో ఉన్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

రాష్ట్రానికి విస్తృతంగా పెట్టుబడులు

(ఐదో పేజీ తరువాయి)

కృషి చేస్తామన్నారు. గత ఏడాది ఈ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.కోటి విడుదల చేసిందని, ఈ ఏడాది కూడా నిధులు విడుదల చేసేందుకు నిర్ణయించిందన్నారు. పైడిమాంబ సిరిమానోత్సవానికి వచ్చేభక్తులు ఆధ్యాత్మికంతో పాటు కుటుంబంతో సహా ఆనందంగా గడిపేలా సంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని, మ్యూజికల్ నైట్, సాంఘిక, పౌరాణిక నాటకాలను ఏర్పాటుచేశామన్నారు. ఈ ఏడాది కూడా తగిన ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. జిల్లా ప్రజలు, అధికారులు, పైడిమాంబ భక్తులు అంతా సహకరించాలని కోరారు.

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

పాలకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ప్రభుత్వ హైస్కూల్‌లో కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాలికలు, 70 మంది బాలురు పాల్గొనగా, 14 మంది చొప్పున బాల బాలికలను ఎంపికచేశారు. వీరందరూ ఈ నెల 24 నుంచి 28 వరకు ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మన్యం జిల్లా తరఫున పాల్గొంటారని మన్యం జిల్లా కబడ్డీ సంఘం గౌరవా ధ్యక్షుడు పల్లా కొండలరావు, ప్రెసిడెంట్ కోడి సుదర్శనరావు, సెక్రటరీ వెన్నపు చంద్రరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొంటారన్నారు.

నాగావళిలోకి 5,500 క్యూసెక్కుల వరద

గరుగుబిల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టుకు నాగావళి నది నుంచి వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. నాగావళిలోకి ఎగువ నుంచి 5,500 క్యూసెక్కుల ప్రవాహం చేరగా, దిగువకు స్పిల్‌వే నుంచి 4,100 క్యూసెక్కులు విడుదల చేశారు.

చింతచెట్టు కూలి ఆరు పూరిళ్ల ధ్వంసం

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జోగిపురంలో శనివారం చింతచెట్టు కూలి ఆరు పూరిళ్లు ధ్వంసమయ్యాయి.ఈ మేరకు ఆదివారం తహసీల్దారు శేఖర్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితులకు రూ.80 వేలుచొప్పున అందజేస్తామని హామీఇచ్చారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తామని తహసీల్దార్ చెప్పారు.

రోడ్లు లేవు.. విద్యుత్ లేదు

● నిర్మాణాలు నిలిపివేసిన లబ్ధిదారులు ● ఇదీ పారాదిలోని పీఎంఏవై ఎన్టీఆర్‌నగర్ పరిస్థితి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని పారాది పంచాయతీలోని పీఎంఏవై ఎన్టీఆర్‌నగర్‌లో ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతోపాటు అప్పట్లో ప్రభుత్వం నిధులు విడుదలచేయకపోవడంతో లబ్ధిదారులు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. ప్రధానంగా రోడ్లు లేవు. విద్యుత్ సదుపాయం కూడా లేదు. దీనికితోడు రోడ్లు లేకపోవడంతో నిర్మాణ సామగ్రి తరలించడానికి ట్రాక్టర్లు, ఎడ్లబళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షం కురిసినా పునాదుల వరకు నీరు చేరుతోంది.

వైసీపీ ప్రభుత్వం హయాంలో పారాదిలో జగనన్న కాలనీ మంజూరు చేశారు. ఇక్కడ రెండు లేఅవుట్లలో 76 మందికి పట్టాలిచ్చారు. కేవలం ఆరుగురు మాత్రమే నిర్మాణాలు పూర్తిచేశారు. 44 మంది పునాదులు వేసి వదిలేశారు. మరో 24మంది పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం కాలనీ మొత్తం తుప్పలతో నిండి అధ్వానంగా మారింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్నకాలనీని పీఎంఏవై ఎన్టీఆర్‌నగర్‌గా పేరుమార్చింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తామని ప్రకటనలతో ఊదరగొట్టిన విషయం విదితమే. అయితే ఇక్కడి కాలనీలో రోడ్లు లేకపోవడంతోపాటు స్తంభాలు వేసినా విద్యుత్ సదుపాయం కల్పించకపోవడంతో ఇళ్లు నిర్మాణాలు పూర్తిచేసిన ఆరుగురు సైతం ఇక్కడ ఉండేందుకు ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం కాలనీలో ముళ్లకంపలు, తుప్పలు పెరగడంతో విషజంతువులు సంచరిస్తున్నాయి. స్థలాలు ఇచ్చినా సౌకర్యాలు కల్పించకపోవడంతో తాము ఇళ్లు నిర్మించుకోలేకపోయామని లబ్ధిదారులు వాపోతున్నారు. అయితే అప్పట్లో వైసీపీ ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో వాటిని పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున మంజూరుచేసింది. అయితే పారాది కాలనీలో లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం చేసే ఆర్థిక సాయంపై అవగాహన లేక నిర్మాణాలు సాగడంలేదన్న ఆరోపణలొస్తున్నాయి. ఈ పథకం కింద బొబ్బిలి నియోజకవర్గంలో 835 ఇళ్లకు అదనపు సాయం అందిస్తే, కేవలం 116 మంది మాత్రమే పూర్తిచేశారు. కాగా నిర్మాణాలు పూర్తిచేయడానికి లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు అందించామని, చర్యలు తీసుకుంటామని హౌసింగ్ డీఈ రెడ్డి వేణు తెలిపారు.



తుప్పలతో నిండిపోయిన పారాది పీఎంఏవై ఎన్టీఆర్‌నగర్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి



ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బొబ్బిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వానికి నివేదించాలని, అసెంబ్లీలో ప్రస్తావించి వాటిని పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం బొబ్బిలిలో ఎమ్మెల్యే బేబీనాయన ఏపీటీఎఫ్ అకడమిక్ రాష్ట్ర కన్వీనరు జేసీ రాజు నాయకత్వంలో ఆ సంఘం నాయకులు కలుసుకొని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేసీరాజు మాట్లాడుతూ పెండింగ్‌లోఉన్న నాలుగు డీఏలను చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి మెమో-57ని అమలు చేయాలని, 12వ పీఆర్‌సీని నియమించాలని, ఐఆర్‌ను ప్రకటించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని కోరారు. ఈ డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్, జీసీహెచ్‌జీ శర్మ, నాగూరు రమేష్, మన్మథరావు, అప్పారావు, చెంచునాయుడు, ఆర్ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తెర్లాం మండలంలోని ఉద్దవోలుకి చెందిన మరడాన చిన్నమ్మికి రూ. 2.70 లక్షలు, అదే గ్రామానికి చెందిన బత్తుల రామారావుకు రూ.30 వేలు చొప్పు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయన అందజేశారు.

అమీర్ కుటుంబానికి పరామర్శ

బాడంగి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాడంగిలో ఇటీవల మృతిచెందిన షేక్ అమీర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే బేబీనాయన ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు తెంటు రవిబాబు, అల్లాడ భాస్కరరావు, సర్పంచ్ కండి రమేష్, వైస్ ప్రెసిడెంట్ మరడాన గాంధీ, గుణుపూరు స్వామినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు ఎల్.సత్యం, ఏగిరెడ్డి శ్రీధర్ ఉన్నారు.

మల్లమ్మ చెరువుకు గండి



మల్లమ్మ చెరువుకు గండిపడిన దృశ్యం

బొబ్బిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని మల్లమ్మపేటకు చెందిన మల్లమ్మ చెరువుకు గండిపడింది. చెరువుగట్టు బలహీనపడడంతో గండి పడిందని రైతులు పోల జగన్, వెంకట రమణ, పెంట రమణ, కర్రి అప్పలనాయుడు తెలిపారు. ఈచెరువు కింద సుమారు వందెకరాల ఆయకట్టు సాగవుతోంది. ప్రస్తుతం వరి పంట ఇక్కడ పొట్టదశలో ఉంది. ఈనేపథ్యంలో చెరువుకు గండిపడడంతో పంట నీటముంపునకు గురయ్యిందని రైతులు తెలిపారు. వరి పంటకు నష్టం కలగకుండా ఉండేందుకు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గండిని రైతులు శ్రమదానంచేసి పూడ్చారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి మల్లమ్మ చెరువు గండిని శాశ్వతంగా పూడ్చాలని రైతులు పేర్కొన్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన మదుముకావడంతో ఏటా వర్షాకాలంలో ఇబ్బందిపడుతున్నామని, శాస్త్రీయంగా మదుములను నూతనంగా ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు. ఈ ఇరిగేషన్ కాలువకు అనుసంధానంగా మల్లమ్మపేటలో కొత్తచెరువు, తమ్మినాయుడు, మల్లమ్మచెరువులు ఉన్నాయని, వాటి మదుముల వ్యవస్థ, గట్లను పటిష్టపరచాలని రైతులు డిమాండ్‌చేస్తున్నారు.

హిందీ నేర్చుకోవాలి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం హెచ్ఎం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో హిందీ దివస్ పురస్కరించుకొని హిందీఉపాధ్యాయుడు ఎం.చినసత్యాన్ని సన్మానించారు.ఈసందర్భంగా హెచ్ఎం, చినసత్యం హిందీభాషకు, సంస్కృతికి ఉన్న సంబంధాన్ని వివరించారు. జాతీయ ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ హిందీ భాషను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

24న పూనా ఒప్పందానికి వ్యతిరేకంగా బహిరంగ సభ

బొబ్బిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి తాండ్రపాపారాయ జంక్షన్‌లో ఈనెల 24న 1932 నాటి పూనా ఒడంబడికకు వ్యతిరేకంగా బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య, భారత రిపబ్లికన్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి గొంప ప్రకాశరావు తెలిపారు. ఆదివారం బొబ్బిలిలోని ఎన్‌జీవో హోంలో పూనా ఒడంబడికకు వ్యతిరేకంగా బహిరంగసభ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1932 సెప్టెంబరు 24న జరిగిన పూనా ఒడంబడిక భారత దేశ కాస్ట్ డెమొక్రసీ చరిత్రలో చీకటి రోజు అని అభివర్ణించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ముందుచూపుతో సర్వహక్కులకు దూరమైన ప్రజలకు రెండు ఓట్ల హక్కును సాధించారన్నారు. హరిజనోద్ధరణ ముసుగులో అన్యాయం జరిగిందన్నారు. ఈ చారిత్రక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 24న జరగనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో దళితనాయకులు ఎండ గోపాలరావు, సత్తి వెంకటరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

బొబ్బిలి రూరల్,సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి):మండలంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం నుంచి అక్టోబరు 15 వరకు పాడి పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు బొబ్బిలి పశు సంవర్ధక శాఖ అధికారి ఎల్.సుధాకర్ తెలిపారు.

●బాడంగి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పశువులకు సోమవారం నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యా ధికారి ఎం.సతీష్‌కుమార్ తెలిపారు.

శంకరరావుకు భారత్ గౌరవ్ అవార్డు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లికి చెందిన తూర్పు భాగవతం కళాకారుడు బొంతలకోటి శంకరరావుకు భారత్ గౌరవ్ అవార్డు-2025 లభించింది.ఈ మేరకు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన ఈసన్ చారిటబుల్ ట్రస్ట్‌నిర్వాహకులు అవార్డును ప్రదానంచేశారు. జైపూరులోని గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన కార్యక్రమంలో దూరదర్శన్ సహాయ డైరెక్టర్ రాజ్ పురోహిత్, సమాచారప్లస్ 24 డైరెక్టర్ జితేంద్ర సింగ్ అవార్డును అందజేశారు.



పాతబొబ్బిలిలో దేశమ్మ ప్రభల ఊరేగింపు



పాతబొబ్బిలిలో అమ్మవారి ప్రభలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

బొబ్బిలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని పాతబొబ్బిలి గ్రామంలో ఆదివారం దేశమ్మ వారాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, మహిళలు, భక్తులు అమ్మవారి ఆలయంలో మొక్కులు చెల్లించారు.ఈ సందర్భంగా ప్రభల ఊరేగింపు ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామపెద్దలు చోడిగంజి రమేష్‌నాయుడు, కోట పెదరాములు, ఏఎంసీ డైరెక్టర్ మింది రమాదేవిరామకృష్ణ పాల్గొన్నారు.



ముత్తావలసలో దేశమ్మ అమ్మవారి పండుగ

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తావలసలో దేశమ్మ అమ్మవారి వారాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించారు. ఏడాది పొడవునా పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలుచేశారు. సర్పంచ్ పిల్లా వసుంధరతోపాటు మహిళలు అమ్మవారికి ముర్రాటలు చెల్లించుకున్నారు.



అమ్మవారి ఆలయానికి వెళ్తున్న భక్తులు

